క్లుప్తంగా

పలువురి ఇళ్లలో చోరీ



ఆత్మకూరు : మండలంలోని పలువురి ఇళ్లలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఓ ఇంట్లో సబ్బిడి కరుణాకర్ అద్దెకు ఉంటున్నాడు. కాగా సోమవారం రాత్రి తాను పనిచేస్తున్న కంపెనీకి నైట్ డ్యూటీకి వెళ్లగా దొంగలు ఇంటి తాళం ధ్వంసం చేసి బీరువాలోని రూ.15 వేలు అపహరించారు. అలాగే మండలంలోని కటాక్షపూర్‌లో రఘుసాల రాజేశ్వరరావు, నానబోయిన మల్లయ్య, నాబోయిన రాజయ్య ఇంట్లో కూడా చోరీ జరిగినట్లు తెలిపారు. అయితే ఆ ఇళ్ల నుంచి ఎలాంటి వస్తువులు అపహరించలేదని పేర్కొన్నారు. అలాగే అదే గ్రామానికి చెందిన గాజుల సాంబయ్య వ్యవసాయ బావి వద్ద మోటర్‌ను ఎత్తుకెళ్లారని బాధితుడు వాపోయాడు. ఎస్సై పరమేశ్వర్ కటాక్షపూర్‌ను సందర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జాతీయస్థాయి క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

ఐనవోలు : రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచిన ఏకశిల విద్యార్థులను ఆ సంస్థ చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి మంగళవారం శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల ఆల్‌రౌండ్ డెవలప్‌మెంట్ లక్ష్యంగా ఏకశిలా విద్యాసంస్థలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నెట్‌బాల్ క్రీడలో జాతీయస్థాయికి ఎంపికైన 9వ తరగతి విద్యార్థి నాగరాజును ప్రత్యేకంగా అభినందించారు. ప్రిన్సిపాల్ బాబా, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, పీఈటీలు నర్సయ్య, నరేష్, రవీందర్, మనోజ్, రాజేష్, రజనీకర్, ప్రేమ్, సుభాష్, కల్యాణి, రజిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ

ఆత్మకూరు : ఈనెల 8,9,10 తేదీల్లో సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ అండర్ -14 విభాగం క్రీడల్లో మండల కేంద్రంలోని జెడ్పీ హై స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. సాత్విక్, రాణా ప్రతాప్, అక్షయ్ బాలుర విభాగంలో ప్రథమ స్థానం, బాలికల విభాగంలో ద్వితీయ స్థానం సాధించారు. వీరిని మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పుల్లా నిర్మలకుమారి, ఫిజికల్ డైరెక్టర్ గ్రేసమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దయాకర్




ఐనవోలు : పద్మశాలి సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన ఆడెపు దయాకర్ నియామకమయ్యారు. మంగళవారం ఆ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు మండల కేంద్రంలోని మల్లికార్జునస్వామిని దర్శించుకున్న అనంతరం రాష్ట్ర, జిల్లా కమిటీల్లో ఎంపికైన నాయకులను రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు డాక్టర్ చందా మల్లయ్య నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు గుర్రపు రామేశ్వర్, గుడిమల్ల కృష్ణారావు, కుసుమ సూర్య ప్రకాశ్, గజ్జెల శ్రీరాములు, ఆడెపు భాస్కర్, ఆడెపు భాస్కర్, బేతి మధు, బేతి వెంకట్రాజం, నరేష్, సతీష్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



వేలేరు : మండల కేంద్రానికి చెందిన దండ రాంరెడ్డికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును మాజీ జెడ్పీటీసీ చాడ సరిత మంగళవారం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రాంరెడ్డి ఇటీవల అనారోగ్యం బారిన పడి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందినట్లు తెలిపారు. ఆర్థికంగా ఆదుకోవాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోరగా స్పందించిన ఆయన సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.60 వేలు మంజూరు చేయించినట్లు తెలిపారు. మండల ఇన్‌చార్జ్ భూపతిరాజు, మండల కో ఆర్డినేటర్ సురేష్, మాజీ సర్పంచ్ మాధవరెడ్డి, విశ్వేశ్వర్ రెడ్డి, ఫారూక్ పాల్గొన్నారు.

శ్మశానవాటికలో స్వచ్ఛభారత్



శాయంపేట : మండల కేంద్రంలోని శ్మశానవాటికలో పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్ మంగళవారం మల్టీపర్పస్ సిబ్బందితో పిచ్చి మొక్కలను, ముళ్లపొదలను తొలగించి చేపట్టారు. శ్మశానవాటిక ప్రాంగణంలో పిచ్చిమొక్కలు, ప్లాస్టిక్ గ్లాసులు, బాటిల్స్, మద్యం సీసాలను తొలగించారు. విలేజ్ హెల్పర్ యాకయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మహనీయులూ మన్నించండి..

- ధ్వంసమైన గాంధీ, సుభాష్ చంద్రబోష్ విగ్రహాలు
- రోడ్లకిరువైపులా నిర్లక్ష్యంగా వదిలేసిన వైనం
- ఆగ్రహిస్తున్న పట్టణవాసులు
- గాంధీ జంక్షన్ కోసం డిమాండ్

పరకాల : 'స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటిష్ వారికి ఎదురుతిరిగి ఉద్యమాన్ని నడిపించిన గాంధీ సేవలు చిరస్మరణీయం.. ఆ రోజు గాంధీజీ లేకుంటే ఈరోజు మనకు స్వేచ్ఛ దొరికేదే కాదు.. ఆయనను నేటితరం యువత స్మరించుకోవాలి'. సుభాష్ చంద్రబోష్ ధీరత్వాన్ని ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలి' ఇలాంటి ఉపదేశాలు స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవం, వారి జయంతి, వర్ధంతి సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారుల నోటి నుంచి వచ్చే మాటలు. కానీ ఆలాంటి ఉపదేశాలు ఆరోజుతోనే ముగిసిపోతున్నాయి. కనీసం వారి విగ్రహాలను గౌరవించే సమయం కూడా అధికారులకు, ప్రజాప్రతినిధులకు లేదా అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పరకాల పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం సమీపంలో రోడ్డు పక్కనే పడేసిన మహాత్మా గాంధీ, సుభాష్ చంద్రబోస్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలను చూసి పలువురు ఆగ్రహిస్తున్నారు. ఎన్‌హెచ్ 363 రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా అంబేడ్కర్ సెంటర్ సమీపంలో ఉన్న మహాత్మా గాంధీ, సుభాష్ చంద్రబోస్ విగ్రహాలను సదరు కాంట్రాక్టర్ తొలిగించి రాజిపేట ప్రాథమిక పాఠశాల ఎదుట నిర్లక్ష్యంగా వదిలేశాడు. అప్పటికే గాంధీ విగ్రహం చేయ్యితో పాటు మరో చేతిలోని పుస్తకం ధ్వంసమైంది. దీంతో విగ్రహాలు పూర్తిగా ధ్వంసమయ్యే అవకాశం ఉందని స్థానికులు ఓ చెట్టుకు ఆనించి పెట్టారు. విగ్రహాల ముందే కొంత కాలంగా పురపాలక సిబ్బంది చెత్తాచెదారం పడేయడంతో స్థానికుల నుంచి విమర్శలు వస్తున్నాయి. ధ్వంసమైన మహాత్మా గాంధీ విగ్రహానికి మరమ్మతులు చేయించకుండా పాలకులు వ్యవహరిస్తున్న తీరు పట్టణవాసులను ఆగ్రహానికి గురిచేస్తుంది.

ఈ రోడ్డుగుండానే చక్కర్లు..

మూడు జిల్లాల ప్రజాప్రతినిధులు ఇదే రోడ్డు గుండానే రాకపోకలు సాగిస్తుంటారు. అయినప్పటికీ నిర్లక్ష్యంగా రోడ్డు పక్కనే వదిలేసిన గాంధీ, సుభాష్ చంద్రబోస్ విగ్రహాలు కనిపించడం లేదా అనే విమర్శలు బహిరంగంగానే వస్తున్నాయి.



ధ్వంసమైన గాంధీ విగ్రహం



గాంధీ విగ్రహానికి గుర్తుతెలియని వ్యక్తులు పూసిన నల్లరంగు



చాలా ఏళ్లుగా ఆవిష్కరణకు నోచుకోని జగ్జీవన్‌రామ్ విగ్రహం

గాంధీ జంక్షన్‌గా మార్చాలి



మహనీయుడు గాంధీ విగ్రహాన్ని పరకాల మార్కెట్ చౌరస్తాలో ఏర్పాటు చేసి జంక్షన్ ఏర్పాటు చేయాలి. గాంధీ విగ్రహం ధ్వంసమై చాలా రోజులు అవుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. చాలా అవమానకరంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

- శ్రీరామ్ రవీందర్, పరకాల

రక్షణ కల్పించాలి



మహనీయుల విగ్రహాలకు జయంతి, వర్ధంతి సమయాల్లో జేజేలు కొట్టడమే కాదు, విగ్రహాలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత పాలకులకు ఉంది. తక్షణమే విగ్రహాలను ప్రధాన కూడళ్లకు మార్చాలి. అధికారులు స్పందికపోవడం శోచనీయం.

- సూర రాజేందర్, యాక్ రీజినల్ కన్వీనర్

బాగుచేస్తానని నమ్మించి బంగారంతో మాయం

ఆత్మకూరు : ఆరోగ్యం బాగాలేదని ఓ మహిళ గుర్తుతెలియని వ్యక్తికి చెప్పగా ఆరోగ్యం బాగుచేస్తానని చెప్పి సదరు గుర్తుతెలియని వ్యక్తి మహిళ బంగారాన్ని ఎత్తుకెళ్లాడు. ఈ సంఘటన మండలంలోని పెంచికలపేటలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెంచికలపేటకు చెందిన పెరుమాండ్ల రాజ్యలక్ష్మి ఇంట్లో ఉండగా సోమవారం ఉదయం ఓ వ్యక్తి వచ్చి 'నీకు ఆరోగ్యం బాగాలేదు, బాగు చేస్తాను' అని చెప్పాడు. దీంతో ఆ మహిళ నమ్మింది. ఈ క్రమంలో ఆమె ఒంటిపై ఉన్న బంగారంపై కన్నేసిన గుర్తుతెలియని వ్యక్తి.. రెండు తులాల బంగారు గోపితాడు, అరతులం చెవి కమ్మలు ఇవ్వాలని కోరగా ఆమె ఇచ్చింది. తీసుకుని తన దగ్గరున్న స్టీల్‌డబ్బాలో వేసినట్లు నమ్మించి దేవుడి దగ్గర డబ్బా పెట్టి ఎవరికి తెలియకుండా పూజచేసి మధ్యాహ్నం 1గంటకు తీయమని చెప్పాడు. మహిళ అలాగే డబ్బాలో పెట్టి పూజచేసి మధ్యాహ్నం తెరిచి చూడగా అందులో బియ్యం కనిపించాయి. దీంతో ఆ మహిళ లబోదిబో మంటూ మంగళవారం ఆత్మకూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆత్మకూరు సీఐ సంతోష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇందిర జన్మదిన వేడుకలు

వేలేరు : కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. అంబేడ్కర్ సెంటర్‌లో కేక్ కట్‌చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల రక్షణే పోలీస్ లక్ష్యం

- ఏసీపీ కిశోర్ కుమార్

నడికూడ : శాంతిభద్రతలను రక్షించడమే పోలీస్‌ల లక్ష్యమని ఏసీపీ కిశోర్‌కుమార్ అన్నారు. మండలంలోని కంఠాత్మకూరు గ్రామంలో సబ్ డివిజన్ పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇళ్లలో సోదాలు చేశారు. గ్రామంలో 10 బెల్టు షాపులు నిర్వహిస్తున్నట్లు గుర్తించి తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో రూ.47,500 మద్యం, 130 గుట్కా, అంబర్ పాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగిఉండాలని అన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ కిశోర్ కుమార్

వికారాబాద్ కలెక్టర్‌పై దాడి అమానుషం



వేలేరు : నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న తహసీల్దార్ కోమి, ఉద్యోగులు



ఐనవోలు : నిరసన తెలుపుతున్న తహసీల్దార్ విక్రమ్ కుమార్, ఉద్యోగులు

కమలాపూర్ : వికారాబాద్ జిల్లా కలెక్టర్‌పై దాడి అమానుషమని, ఇలాంటి దాడులకు పాల్పడడం సరికాదని జనతాదళ్ (సెక్యులర్) పార్టీ (జేడీఎస్) రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి వాసు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామస్తులతో చర్చించేందుకు వెళ్లిన వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్, రెవెన్యూ సిబ్బందిపై లగిచెర్ల గ్రామస్తులు రాళ్లు, కర్రలతో దాడి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో నిరసనలు తెలిపే హక్కు ప్రతి పౌరునికి ఉందని, దాడులకు పాల్పడే హక్కు మాత్రం ఎవరికీ లేదన్నారు. దురుద్దేశపూర్వకంగా దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

ఐనవోలు : వికారాబాద్ జిల్లా లగచెర్ల గ్రామంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, స్పెషల్ ఆఫీసర్ వెంకట్ రెడ్డి, తహసీల్దార్, అధికారులపై జరిగిన దాడికి నిరసనగా మంగళవారం మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట రెవెన్యూ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీజీటీఏ రాష్ట్ర నాయకుడు, తహసీల్దార్ విక్రమ్ కుమార్ మాట్లాడుతూ.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ట్రెంగ జిల్లా అధ్యక్షుడు, మండల ఆర్ఐ మరుపట్ల మల్లయ్య మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్‌కే భద్రత లేకుంటే కిందిస్థాయి ఉద్యోగుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. డీటీ అనిల్ కుమార్, ఎంఆర్ఐ రాణి, సర్వేయర్ సూరజ్, జేఏ రమేశ్, మోహినోద్దీన్, విజయ, జయశ్రీ, సాంబరాజు, ధరణి ఆపరేటర్ సత్యం, పాల్గొన్నారు.

వేలేరు : వికారాబాద్ జిల్లాలో భూ సేకరణ కోసం రైతులతో సమావేశం నిర్వహించేందుకు వచ్చిన కలెక్టర్, రెవెన్యూ ఉద్యోగులపై దాడి చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని తహసీల్దార్ హెచ్.కోమి డిమాండ్ చేశారు. మంగళవారం టీఎన్‌జీఓ ఉపాధ్యక్షుడు హేమనాయక్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్, ఆర్ఐ సురేందర్ పాల్గొన్నారు.

తప్పులు లేకుండా సమగ్ర సర్వే చేయాలి



దామెర : మండలంలో కొనసాగుతున్న కుటుంబ సమగ్ర సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ప్రణాళిక అధికారి సత్యనారాయణరెడ్డి అన్నారు. దామెర మండలం ఊరుగొండతో పాటు ఆత్మకూరు మండలం నీరుకుళ్లలో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను మంగళవారం ఆయన పర్యవేక్షించారు. ఎన్యుమరేటర్లకు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. కుటుంబ సభ్యులు వివరాలు క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని అన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, సూపర్‌వైజర్ భారతి, అధికారి ఝాన్సీ, పంచాయతీ కార్యదర్శి రామ్మూర్తి, రేణుక ఉన్నారు.

కమలాపూర్‌లో..



కమలాపూర్ : ఇంటింటి సమగ్ర సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని ఎంపీడీఓ గుండె బాబు సూచించారు. మండలంలోని శంభునిపల్లి, మర్రిపల్లిగూడెంలో కొనసాగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం మర్రిపల్లిగూడెంలో ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో నిర్దేశిత ప్రొఫార్మా ప్రకారం కుటుంబ యజమానితో పాటు కుటుంబ సభ్యుల సమాచారం నమోదు చేయాలన్నారు. మండలంలో ఒక్క ఇల్లు, ఒక్క కుటుంబం కూడా తప్పిపోకుండా సర్వే చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రవి, ఈజీఎస్ ఏపీఓ రమేశ్, ఈసీ కార్తీక్, ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

శాయంపేటలో..



శాయంపేట : ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సమగ్ర సర్వేను ఎన్యుమరేటర్లు సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీడీఓ ఫణిచంద్ర, ఎంపీఓ రంజిత్‌కుమార్, ఎంపీఎస్ఓ ప్రమోద్‌కుమార్ అన్నారు. మండలంలో కొనసాగుతున్న సర్వేను మంగళవారం పరిశీలించారు. సమగ్ర సర్వేలో ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కుటుంబ సభ్యుల వివరాలు అన్నీ నిర్దేశించిన ప్రొఫార్మా ప్రకారం నింపాలని ఎన్యుమరేట్లకు సూచించారు. పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్, ఎన్యుమరేటర్ జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగాలి



ఎల్కతుర్తి : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ రమేశ్

ఎల్కతుర్తి : మండలంలో ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని సీఐ పులి రమేశ్ అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంతో పాటు దండేపల్లి, సూరారంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎస్సై రాజ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగుతున్నాయా.. ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా.. అని రైతులను అడిగితెలుసుకున్నారు. ధాన్యాన్ని తరలించేందుకు లారీలు అందుబాటులో ఉన్నాయా అని సెంటర్ నిర్వాహకులను తెలుసుకున్నారు. ఒక్క బస్తా తూకం ఎంతవేస్తున్నారు అని, మిల్లర్లు ఏమైనా కోతలు విధిస్తున్నారా.. అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధాన్యాన్ని దళారులకు తక్కువ ధరకు విక్రయించి మోసపోవద్దని అన్నారు. ఎక్కడైనా మోసం జరిగినట్లైతే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. వారి వెంట సిబ్బంది బక్కయ్య, రాజు, ఏపీఎం రవీందర్, సెంటర్ నిర్వాహకులు, రైతులు ఉన్నారు.

హక్కులపై అవగాహన కలిగిఉండాలి



అవగాహన కల్పిస్తున్న సఖి సంస్థ ప్రతినిధులు

దామెర : మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన కలిగిఉండాలని సఖి సంస్థ కేస్ వర్కర్లు హరిత, వినీల సూచించారు. మండలంలోని దమ్మన్నపేట్, సింగరాజుపల్లిలో సర్వోదయ యూత్ ఆర్గనేజేషన్, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళలకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. మహిళలు, యువతులు లైంగిక వేధింపులు, గృహహింసకు గురైతే ధైర్యంగా ముందుకొచ్చి సఖి కేంద్రంలో ఫిర్యాదు చేయాలన్నారు. న్యాయ సాయం, తాత్కాలిక వసతి, కౌన్సెలింగ్, వైద్యసాయం, పోలీస్ సాయం అందించి అండగా నిలుస్తుందన్నారు. సమస్యలు ఎదుర్కొంటున్న మహిళలు 181 టోల్ ఫ్రీ నంబర్‌కు లేదా 08702452112 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఆయా గ్రామాల స్వయం సహాక సంఘాల మహిళా గ్రూప్ సభ్యులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలి

- మాజీ సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి



సర్వేను పరిశీలిస్తున్న సుధాకర్‌రెడ్డి

ఆత్మకూరు : గత బీఆర్ఎస్ ప్రభుత్వం కులగణన సర్వే నిర్వహించి ప్రజలకు కావాల్సిన అవసరాలు తీర్చలేకపోవడంతో ప్రజలు గుణపాఠం చెప్పారని మాజీ సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిదిరాల సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కులగణన సర్వేను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు ఇప్పటి వరకు రైతుబంధు, రుణమాఫీ పూర్తిస్థాయిలో అందించలేదన్నారు. చిన్న, సన్నకారు రైతులు ప్రభుత్వం అందించే సహాయం కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి రైతుబంధుతో పాటు రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. కులగణన సర్వే పారదర్శకంగా నిర్వహించి వెంటనే అమలు చేయాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు న్యాయం చేయాలన్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే సర్వేలు చేసి అమలు చేయకుంటే ప్రభుత్వంపై నమ్మకం పోతుందన్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించి కులగణన సర్వేతో పాటు రిజర్వేషన్లు ప్రకటించాలని కోరారు.

మామ ఫిర్యాదుతో అల్లుడిపై కేసు నమోదు

వేలేరు : మండల కేంద్రానికి చెందిన కట్ట మమత, ఆమె తండ్రి సింగసారం సారయ్య, ఆమె తల్లి ఎల్లమ్మపై దాడిచేసిన కేసముద్రం గ్రామానికి చెందిన కట్ట సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజ్మీరా సురేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బాధితుడు ఫిర్యాదులో తెలిపిన వివరాల ప్రకారం.. ఇంట్లో తన కూతురిని అల్లుడు సంతోష్ కొడుతుండగా తాము అడ్డుపడినట్లు తెలిపారు. ఈ క్రమంలో తమను కొట్టాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ముగ్గురుని కొడుతుండగా చుట్టుపక్కల వారైన సింగసారం సంపత్, కల్పన తదితరులు వచ్చి అడ్డుకుని తమను ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సంక్షిప్తంగా

నేడు విద్యుత్ లోకల్ కోర్టు

ఎల్కతుర్తి : మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో బుధవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి లోకల్ కోర్టు నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ సుధాకర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. లోకల్ కోర్టులో విద్యుత్ పునరుద్ధరణ, ఓల్టేజీ హెచ్చుతగ్గులు, లోపాలు ఉన్న మీటర్లను మార్చడం వంటి సమస్యలపై రాతపూర్వకంగా ఫిర్యాదు ఇస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. లోకల్ కోర్టు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు, రైతులు వినియోగించుకోవాలని సూచించారు.

చర్య తీసుకోవాలి

శాయంపేట : తన తండ్రికి చెందిన 30 గుంటల భూమిని మరో రైతు వద్ద నుంచి కొనుగోలు చేసినట్లు బినామీ కాగితాలు సృష్టించి పట్టా చేసుకున్న రైతుపై అధికారులు చర్యలు తీసుకోవాలని రైతు చిట్టిరెడ్డి రజినీకర్ రెడ్డి అధికారులకు వేడుకున్నారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం.. పత్తిపాక గ్రామానికి చెందిన తన తండ్రి చిట్టిరెడ్డి బుచ్చిరెడ్డికి చెందిన 30 గుంటల భూమిని అదే గ్రామానికి చెందిన చిట్టిరెడ్డి రాజిరెడ్డి మరో వ్యక్తి నుంచి కొనుగోలు చేసినట్లు బినామీ కాగితాలు సృష్టించినట్లు ఆరోపించారు. సర్వే నంబర్ 532/ఏ ను 532/బీగా దిద్దుకొని పట్టా చేసుకున్నాడని ఆరోపించారు. దీంతో గతంలో ఆర్డీఓకు ఫిర్యాదు చేసి కోర్టులో కేసు వేసినట్లు తెలిపారు. 2024లో తనకు అనుకూలంగా తీర్పు రావడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించి తన భూమిలో హద్దురాళ్లు వేసుకున్నట్లు తెలిపారు. చిట్టిరెడ్డి రాజిరెడ్డి తన హద్దురాళ్లను కూలగొట్టడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

నిప్పంటించుకున్న వ్యక్తి

- కాపాడిన ఎస్సై

దామెర : కుటుంబ కలహాల కారణంగా ఓ వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని పులుకుర్తిలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీస్‌లు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని పులుకుర్తికి చెందిన గోవిందు రాజుకు ఖిలావరంగల్‌కు చెందిన రజితతో 12 ఏళ్ల క్రితం వివాహం అయ్యింది. వారికి ముగ్గురు ఆడపిల్లలు కాగా కుటుంబ కలహాల కారణంగా 3 సంవత్సవాల నుంచి రజిత కాపురానికి రావడంలేదు. దీంతో మనస్థాపం చెందిన రాజు మంగళవారం సాయంత్రం గ్రామ కూడలిలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. గమణించిన స్థానికులు దామెర ఎస్సై కొంక అశోక్‌కు సమాచారం అందించారు. దీంతో వెంటనే తమ సిబ్బంది సంఘటనా స్థలానికి పంపించారు. అంబులెన్స్ వచ్చేందుకు సమయం పడుతుందని తెలుసుకుని పోలీస్ వాహనంలో చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. కాగా వెంటనే స్పదించిన ఎస్సై అశోక్, ఏఎస్సై యాకయ్య సిబ్బందికి పలువురు అభినందనలు తెలిపారు.

ధర్మయుద్ధానికి తరలిరావాలి

ఐనవోలు : డిసెంబర్ 21న హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన మాదిగల ధర్మయుద్ధం మహాసభకు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్ మాదిగ పిలుపునిచ్చారు. అనుబంధ సంఘాలతో మాట్లాడారు.

మార్కెట్ కమిటీ నియామకం



ఝాన్సీరాణి

కమలాపూర్ : కమలాపూర్ వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీని ప్రకటిస్తూ ఏపీసీ, ప్రభుత్వ కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా తవుటం ఝాన్సీరాణి, వైస్ చైర్మన్‌గా దేశిని అయిలయ్య, డైరెక్టర్లుగా ఓర్సు తిరుపతి, ఆకినపెల్లి భిక్షపతి, కిన్నెర కృష్ణమూర్తి, వంటకాల అనిల్‌రెడ్డి, సముద్రాల కృష్ణ, మిల్కూరి శ్రీనివాస్, నిగ్గుల లింగయ్య, ఎండీ.చిన్నయాకూబ్‌అలీ, జనగాని శివకృష్ణ, గట్టు శ్రీధర్‌గౌడ్, కెత్తె విజేందర్ నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అదేవిధంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్, జిల్లా మార్కెటింగ్ అధికారి, వ్యవసాయ శాఖ ఏడీఏ, కమలాపూర్ గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారిని సభ్యులుగా నియమిస్తున్నట్లు వెల్లడించారు.